క్లుప్తంగా

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

ఖానాపూర్: ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని నీడ కోసం టెంట్, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మరోవైపు కూలీలకు పనిముట్లు సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో ప్రభాకర్, రాము, రమేశ్, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన


కూలీలకు సూచనలిస్తున్న ఎంపీడీవో

సోన్: మండలంలోని న్యూవెల్మల్ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఎండల నేపథ్యంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంతోపాటు ఉదయం ఏడు నుంచి పదిన్నర గంటల వరకు మాత్రమే పనులు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీలో మొక్కలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, కారోబార్ మహేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామంలో కోండ్ర గంగవ్వ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ సుక్కు రాజవ్వ–ముత్తన్న దంపతులు గంగవ్వ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.ఐదు వేల ఆర్థికసాయం అందించారు. వారి వెంట కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

భైంసాటౌన్: భైంసా పట్టణంలో గురువారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీలకు బిల్లులు అందజేస్తాం


మాట్లాడుతున్న ఎంపీడీవో

లోకేశ్వరం: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్ బిల్లులు అందజేస్తామని ఎంపీడీవో సోలామన్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ తదితరులు ఉన్నారు.

జాబితా నుంచి అనర్హులను తొలగించాలి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కడెం: డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితా నుంచి అనర్హులను తొలగించాలని మండలంలోని కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని చిన్నక్యాంప్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్యకు ఫిర్యాదు చేశారు. జాబితాలో చిన్నక్యాంప్, కన్నాపూర్‌కు చెందిన చాలా మంది అనర్హులు ఉన్నారని.. వారి పేర్లను తొలగించి అర్హులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్, కోటయ్య, కొమురయ్య, భూదయ్య తదితరులు ఉన్నారు.

పాడి రైతులకు రుణాలు

లోకేశ్వరం: పాడి పశువుల పెంపకం చేపట్టే రైతులకు రుణాలు అందిస్తామని.. సద్వినియోగం చేసుకోవాలని అబ్దుల్లాపూర్ ఎస్‌బీఐశాఖ మేనేజర్ తిరుమలేశ్ అన్నారు. బుధవారం మండలంలోని రాజూర గ్రామంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ భైంసా బీఎంసీ కింద ఉన్న గ్రామాల్లోని లబ్ధిదారులకు త్వరలో ముద్ర రుణాలు అందజేస్తామన్నారు. వారి వెంట సూపర్‌వైజర్ దండే రమేశ్, పాలమిత్రలు ఉన్నారు.

రోడ్లపైనే మురుగునీరు

- కొట్ల(బి)లో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- దెబ్బతింటున్న నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారి
- వానాకాలంలో పొంచి ఉన్న రోగాల ముప్పు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


కొట్ల(బి)లో రోడ్డు పక్కనే నిలిచిన మురికి నీరు


కొట్ల(బి) సాయిబాబా ఆలయం వద్ద మురికినీటితో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

సారంగపూర్: అధికారుల పర్యవేక్షణ లోపంతో మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొట్ల(బి) గ్రామంలో నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లలోని మురికి నీరు రోడ్డుపై చేరుతోంది. ఈ రోడ్డుకు ఒకవైపే మురికి కాలువ ఉండగా.. మరోవైపు కాల్వ నిర్మించకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైకే వస్తుంది. ఇలా గ్రామంలో ప్రవేశించినప్పటి నుంచి సాయిబాబా ఆలయం వరకు దాదాపు మూడు చోట్ల మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తూ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డు దెబ్బతినడంతోపాటు గ్రామస్తులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

దోమలు, ఈగలకు అవాసంగా..

ఇళ్ల నుంచి మురికినీరు రోడ్డుపైకి వస్తుండటంతో గుంతల్లో నిలిచి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారాయి. దీంతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు పంట పొలాల నుంచి కూడా నీరు రోడ్లపైకి వస్తుండటంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాహనాలు వెళ్లినప్పుడు గుంతల్లో నిలిచిన నీరు, పాదచారులపై పడే ప్రమాదం ఉంది. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దామని బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు కనీసం సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సాయినగర్‌లో..


సాయినగర్‌లో సీసీ రోడ్డుపై నీరు

మండలంలోని సాయినగర్‌లో నీటి ట్యాంకు నుంచి ఇళ్లకు సరఫరా చేసే తాగునీటి ప్రధాన పైపులైన్‌కు రెండు చోట్ల లీకేజీ ఏర్పడింది. దీంతో సదరు నీరంతా గ్రామంలోకి వెళ్లే సీసీ రోడ్డుపై నిలుస్తోంది. పైప్‌లైన్ లీకేజీల కారణంగా తాగునీరు సైతం కలుషితమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

యజమానులకు నోటీసులిచ్చాం

ఇళ్ల నుంచి మురికి నీరు వస్తుండటంతో రోడ్డు గుంతలు ఏర్పడి దెబ్బతింటుంది. ఇప్పటికే ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి మురికి నీటిని రోడ్డుపైకి వదిలే ఇళ్ల యజమానులకు నోటీసులు అందజేశాం. ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని సూచించాం. సాయినగర్‌లో పైప్‌లైన్ లీకేజీ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సమాచారమిచ్చి సమస్య పరిష్కరిస్తాం.

– సరోజ, ఎంపీడీవో, సారంగపూర్

ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో 113 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం రూ.20 లక్షలతో నిర్మించే పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. తహసీల్దార్ విశ్వంబర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మీరా, శంకర్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, టీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, అనిల్, పిరాజీ తదితరులు ఉన్నారు.

విఠాపూర్‌లో భూమిపూజ..

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో రూ.18లక్షలతో నిర్మించే ముత్యాలమ్మ, చాందమహంకాళి, మహాలక్ష్మీ, అమ్మవారి ఆలయాల పునర్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. మండలంలోని పెంచికల్‌పాడ్‌కు చెందిన జే.లక్ష్మికి రూ.64వేలు, కీని సాయవ్వకు రూ.24 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరవగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గల్లపురం లక్ష్మీరమేశ్, ఎంపీటీసీ మధుకర్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, ఉపసర్పంచ్‌లు నవీన్‌రెడ్డి, కిష్టయ్య, స్థల దాత గణపతిరావు పటేల్, వీడీసీ చైర్మన్ అశోక్, బుచ్చన్న, విఠల్‌రావు, చంద్రకాంత్, లక్ష్మణ్‌రావు, పురుషోత్తం, లింగారెడ్డి, రవి, సుదర్శన్, నారాయణ్‌రెడ్డి, ఏఈవో గణేశ్ తదితరులున్నారు.

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

భైంసారూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. పంచాయతీ కార్యదర్శులను సీఎం కేసీఆర్ రెగ్యులర్ చేస్తామని ప్రకటించడం హర్షనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం భైంసా మండల పరిషత్ కార్యాలయం ముందు సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే, పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంజీవ్‌రెడ్డి, గంగాధర్, సోలంకి భీంరావు, రాజేశ్వర్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

భైంసారూరల్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఇటీవల నిర్వహించిన సీఎంకప్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన భైంసా పట్టణానికి చెందిన ఫుట్‌బాల్ జట్టును బుధవారం మండలంలోని దేగాం గ్రామంలో తన నివాసంలో అభినందించారు. ఈనెల 28న హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో విజయం సాధించాలన్నారు. అనంతరం జట్టు సభ్యులకు మిఠాయిలు తినిపించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే బాపురావ్

సారంగపూర్: మండలంలోని దుప్యాతండాకు చెందిన జాదవ్ ఈశ్వర్‌సింగ్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ బుధవారం గ్రామానికి వచ్చి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని కోలిగల్లీకి చెందిన సప్పటోళ్ల చిన్నన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను బుధవారం ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు రామరావ్‌పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కోరి పోతన్న, రాజాగౌడ్, చంద్రకాంత్, యశ్వంత్‌రావుపటేల్, తాటివార్ రమేశ్, ఫిరోజ్‌ఖాన్, భూషణ్, రఘుపటేల్ తదితరులు ఉన్నారు.

చిరుధాన్యం.. ఆరోగ్య ధనం


వంటకాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

భైంసారూరల్: చిరు ధాన్యం ఆరోగ్య ధనమని.. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పోషకాహార వంటకాలపై అంగన్‌వాడీ టీచర్లకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

దస్తురాబాద్: గతంలో జర్నలిస్టుగా సేవలందించిన మండల కేంద్రానికి చెందిన జుంబర్తి శివ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని విశ్రాంత ఐఏఎస్ శర్మన్ నాయక్ పరామర్శించి రూ.ఐదు వేలు అందించారు. వారి వెంట ఆటో యూనియన్ నాయకులు, గ్రామస్తులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత.. ఇద్దరిపై కేసు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్, శాంతినగర్ కాలనీల్లోని గుడుంబా స్థావరాలపై బుధవారం ఖానాపూర్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఇద్దరిపై కేసు నమోదు చేసి 13లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. గుడుంబా, మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో గుడుంబా విక్రయించినా, తయారు చేసినా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన


ముధోల్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది


లోకేశ్వరంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ముధోల్: మండల కేంద్రంలో కలెక్టర్, ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు బుధవారం క్షయ నిక్షయ్ దివాస్ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ వెంకటరావు రాజేందర్ మాట్లాడుతూ ప్రజలకు క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా దగ్గు, జ్వరం వంటి లక్షణాలుంటే సమీపంలోని ఆశావర్కర్లను సంప్రదించాలన్నారు. క్షయ నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందవద్దని.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తారని పేర్కొన్నారు. క్షయ రహిత దేశంగా మార్చేందుకు అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆకాశ్, సాయి సువర్ధన్, హెడ్‌నర్సు పద్మలత, ల్యాబ్ టెక్నీషియన్ ప్రకాశ్, స్టాఫ్‌నర్సు పార్వతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్మూలించాలి

లోకేశ్వరం: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని నిర్మల్ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమ సూపర్‌వైజర్ లాలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బరువు తగ్గడం, రెండు వారాలకు మించి దగ్గు ఉంటే సమీపంలోని వైద్యుల్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగన్న తదితరులు ఉన్నారు.

‘వీవోఏల సమస్యలపై నిర్లక్ష్యం’

ఖానాపూర్: వీవోఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీపీఎం నాయకులు చుంచుల నారాయణ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు వీవోఏలు చేపట్టిన సమ్మె బుధవారం 36వ రోజుకు చేరింది. ఆయన సమ్మెలో కార్మికులకు మద్దతుగా బైఠాయించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీవోఏల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో లావణ్య, గంగాధర్, రవీందర్, స్వరూప, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ పంచాయతీ పరిధిలోని కొత్తవాడలో బుధవారం ఉపాధిహామీ పనులు ముమ్మరంగా సాగాయి. డీ–27 ఉపకాలువలోని పూడిక, పిచ్చిమొక్కలను సిబ్బంది తొలగించారు. ఎగువ భాగంలో పలు చోట్ల ఏర్పడిన గండ్లను పూడ్చివేసి పంట చేన్లకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కూలీలు కోరారు. కాగా ఉపాధి పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జారాంయాదవ్

కుంటాల: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గజ్జారాంయాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్‌కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ ‘కర్ర’ంటు స్తంభం



తానూరు: మండలంలోని వడ్‌ఝరి(బి) గ్రామ సమీపంలో ఝరి(బి) వెళ్లే మార్గంలో రోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ తీగలకు రక్షణగా రైతులు కర్రస్తంభం ఏర్పాటు చేశారు. కర్రస్తంభం విరిగి ఎప్పుడు ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఝరి(బి), ఝరి(బి)తండా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు కర్రస్తంభం స్థానంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జాదవ్ ప్రదీప్, విద్యుత్ ఏఈ, **ఫోన్:** 94408 14880

ట్రాఫిక్ పోలీసుల కష్టాలు


ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తాలో..


బస్టాండ్ ప్రాంతంలో..

రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కానీ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ కానిస్టేబుళ్లు మండుటెండలను లెక్క చేయకుండా రోజంతా విధులు నిర్వర్తిస్తున్నారు. కనీసం కొన్ని కూడళ్ల వద్ద తాగునీటి సౌకర్యం లేకపోవడంతో సమీపంలోని హోటళ్లు, సోడా బండ్ల వద్దకు వెళ్లి దాహార్తి తీర్చుకుంటున్నారు. భానుడి ప్రతాపానికి సిగ్నల్ వద్ద ట్రాఫిక్ కంట్రోల్ చేయడం పోలీసులకు సవాలుగా మారింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


కలెక్టరేట్ వద్ద ..


కొండా లక్ష్మణ్ బాపూజీ కూడలి వద్ద..

‘మా భూములు మాకు ఇప్పించాలి’


ర్యాలీగా వెళ్తున్న బాధితులు

ముధోల్: తమకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా.. అధికారులు దళిత బస్తీ పథకం కింద ఇతరులకు పంపిణీ చేశారని మండలంలోని వెంకటాపూర్ గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు బుధవారం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. తమ వద్ద భూమికి సంబంధించిన పట్టాలుండగానే బీఆర్ఎస్ ప్రభుత్వం ఇతరులకు తమ ప్లాట్లు కేటాయించారని.. తిరిగి తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

‘రాబోయేది బీజేపీ ప్రభుత్వమే’

ముధోల్: రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ సీనియర్ నాయకులు మోహన్‌రావ్‌పటేల్ అన్నారు. పల్లెపల్లెకు బీజేపీ –గడగడపకు మోహన్‌రావుపటేల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాంటెక్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పాలన మరిచి కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర పథకాలను వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వారి వెంట మాజీ ఎంపీపీ సుభాశ్ పటేల్ తదితరులు ఉన్నారు.

‘కంటివెలుగు’ ప్రారంభం

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ కొప్పుల లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ గోపాల్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కుంటాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ భోజాబాయి, మాజీ సర్పంచ్ దిగంబర్‌పటేల్, నిర్వాహకులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిచెన్‌గార్డెన్ ఏర్పాటుతో లాభాలు

కుంటాల: పాఠశాలల్లో ఏర్పాటు చేసే కిచెన్‌గార్డెన్‌తో ఎన్నో లాభాలున్నాయని ఎంపీవో రహీం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓలా పాఠశాల ఆవరణలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. కిచెన్‌గార్డెన్ ద్వారా తాజా కూరగాయలు లభిస్తాయన్నారు. వారి వెంట సర్పంచ్ కనీష్‌ఫాతిమా, ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899